# ఏది అనైతికం?

ఆంధ్రభూమి వీక్లీ.. 4 ఏప్రిల్, 2002



"నమస్తే. నా పేరు కల్పన! సుదర్శన్‌గారి పి.ఏ.ని!"

తలెత్తి చూసిన మాధవ్ ఆశ్చర్యపోయాడు.

ఆమె చాలా అందంగా ఉంది...

ఒక్క నిమిషం కళ్ళు తిప్పుకోలేకపోయాడు. తర్వాత తేరుకొని, "కూర్చోండి... సుదర్శన్‌గారు రాలేదా?" అని అన్నాడు.

"ఆయన దారిలో ఇన్‌కంటాక్స్ ఆఫీసు దగ్గర ఆగారు. ఇంకో ఐదునిమిషాల్లో వచ్చేస్తారు. ఈలోగా ఈ ప్రపోజల్స్, ఎస్టిమేట్స్ మీకివ్వమని చెప్పారు!"

"ఇటివ్వండి..!" అంటూ తీసుకుని చూడసాగాడు.

అయితే అతని మనసు ఆ అంకెలపై నిలవడం లేదు. కల్పనని అలాగే చూస్తూ ఉండిపోవాలనిపిస్తోంది అతనికి.

బెల్ కొట్టి, ప్యూన్ రాగానే- "రెండు కాఫీలు పట్రా..!" అన్నాడు.

"అబ్బే... వద్దండీ! నేను కాఫీ తాగను!"

"అయితే... మూడు కూల్‌డ్రింక్స్ తీసుకురా!" అని మళ్లీ పేపర్లు చూడసాగాడు.

ఇంతలో సుదర్శన్ వచ్చాడు.

"గుడ్‌మార్నింగ్! అన్నీ సరిపోయాయా?"

"ఆఫ్‌కోర్స్... మీరు కంపెనీ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ కూడా పంపించారంటే నేను మా హెడ్ ఆఫీసుకి రెకమెండ్ చేస్తూ పంపుతాను!"

"మీరు మాకు చాలా సహాయం చేస్తున్నారు..!" అన్నాడు సుదర్శన్.

"అదేంకాదు. మీ బిజినెస్ బాగుంది. ప్రోడక్ట్స్ బాగున్నాయి. పైగా- మా బ్యాంకుకి లాభాలొచ్చే ఏ బిజినెస్‌నీ నేను వదులుకోను!" అన్నాడు మాధవ్.

కూల్‌డ్రింక్స్ తాగాక సుదర్శన్ శెలవు తీసుకున్నాడు.

అతనితోపాటు వెళ్తున్న కల్పనని చూడసాగాడు మాధవ్-

'ఈమె ముఖం ఎంత ప్రశాంతంగా ఉందో- ఆమె శరీరం అంత అలజడిని రేపగలదు!' ఆమెని వెనుకనుంచి చూస్తూ అనుకున్నాడు.

• • •

వర్షం జోరుగా కురుస్తోంది!

పోర్టికోలో కూర్చుని ఉన్నాడు మాధవ్.

అతనికి ఎంతో ఇష్టం... అలా వాన కురుస్తూ ఉన్నప్పుడు పోర్టికోలో కూర్చుని వానని చూస్తూండడం!

టేప్‌లో నుంచి పాట వస్తోంది... 'చిటపట చినుకులు మనకోసం కురిశాయి- అవి మనలోన ఏవో ఆశలు రేపాయి!'

మాధవ్ వానపాటల్ని రెండు కేసెట్లలో రికార్డ్ చేసుకున్నాడు. ఇలా వాన కురుస్తున్నప్పుడు ఆ పాటలు వింటూంటాడు.

'తేటతేట తెలుగులా... తెల్లవారి వెలుగులా...' ఇంకో పాట మొదలైంది.

మాధవ్‌కి 'ప్రేమనగర్' సినిమాలోని ఆ పాట సన్నివేశం గుర్తుకువచ్చింది. తానూ అందులో హీరో కళ్యాణ్‌లా లాల్చీ, పైజామాతో ఉన్నాడు. బయట వర్షం కూడా కురుస్తోంది. లేనిదల్లా తెలుగువారి ఎంకిలా లత!

వెంటనే అతనికి కల్పన గుర్తుకొచ్చింది.

అతని మనసంతా తీయని బాధతో విలవిలలాడింది. ముప్పై ఏళ్లయినా పెళ్ళిచేసుకోని తను- ఓ అమ్మాయిని చూసి స్పందించడం ఇదే మొదటిసారి!

ఇంతలో... ఫోను మ్రోగింది.

కార్డ్‌లెస్ ఫోను అందుకొని, "హలో..!" అన్నాడు.

"హలో మాధవ్‌గారూ... నేను సుదర్శన్‌ని!"

"హలో సార్... ఎలా వున్నారు?"

"అయామ్ ఫైన్! వాన కురుస్తోంది కదా... ఏం చేస్తున్నారు?"

"ఒంటరి బ్రహ్మచారిని! వానని చూస్తూ... వానపాటలు వింటూ ఎంజాయ్ చేస్తున్నాను!"

"అదృష్టవంతులు! మాకంత టైమూ, ఓపికా ఉండవు. బైదిబై... మా ఆడిటర్ నుంచి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ వచ్చాయి. వాటిని కల్పనతో మీ ఇంటికి పంపిస్తున్నానిప్పుడు!"

"ఇప్పుడా? ఎందుకండీ... వానలో ఆమెకి శ్రమనివ్వడం? రేపు బ్యాంకుకే పంపండి!"

"ఆరేగా... టైము ఇప్పుడు? పైగా- ఆమె కారులోనే వస్తోంది!"

"సరే... మీ యిష్టం!" మరేం మాట్లాడలేక అన్నాడు.

"మిస్టర్ మాధవ్! కల్పన ఎలావుంది?" సుదర్శన్ అడిగాడు.

"షి ఈజ్ బ్యూటిఫుల్..!" ఆమెని కళ్ళముందు ఊహించుకుంటూ అన్నాడు మాధ[illegible]

"మీకు కంపెనీ ఇవ్వడానికే ఆమె వస్తోంది. హేవ్ ఎ నైస్‌టైమ్..!" అంటూ ఫోన్ [illegible]డు.

• • •

బయట కారాగిన చప్పుడైంది.

కల్పన గేటు తీసుకొని వడివడిగా లోపలికొచ్చింది.

"అరెః... కాస్త ఆగితే గొడుగు తెచ్చేవాణ్ణిగా? నేనందుకే లోపలికి వెళుతున్నాను!" అన్నాడు.

"ఫర్వాలేదులెండి... మేం చిన్న ఉద్యోగస్థులం! ఎండకీ, వానకీ భయపడితే ఎలా?" అంది.

అది విసురో, వివరణో అర్థంకాలేదు అతనికి.

"రండి... లోపలికెళ్దాం!" అంటూ హాల్లోకి ఆహ్వానించాడు.

ఆ కొంతవానలో నడిచేసరికే ఆమె పూర్తిగా తడిసిపోయింది. టవల్ తెచ్చిచ్చాడు తుడుచుకోవటానికి!

ఆమె తుడుచుకుంటూంటే సోఫాలో కూర్చుని ఫైల్ చూడసాగాడు.

అయితే... అతని మనసు ఫైల్లోని అంకెలపై నిలవడం లేదు.

తలెత్తి ఆమెని చూశాడు...

టవల్‌తో తుడుచుకుంటుండగా పైట జారడంతో- కనిపించిన అందాలు అతన్ని ఎంతో ఇబ్బంది పెట్టాయి.

తర్వాత ఆమె అతనికి ఎదురుగా వున్న ఇనుప కుర్చీలో కూర్చుంది... సోఫాలో కూర్చుంటే తడికి పాడవుతాయని!

ఆమె బట్టలు త్వరగా ఆరడానికి ఫ్యాను స్పీడు ఎక్కువ చేశాడు.

ఆమె చలికి కొద్దిగా వణకడం చూసి, అతనికి ఎంతో ముద్దేసింది. ఫ్యాను స్పీడు తగ్గించి ఆమెను ఫ్రీగా ఉంచడానికి మాటల్లో దించాడు-

"మీరు సుదర్శన్‌గారి దగ్గర ఎన్నిరోజుల్నుంచి పనిచేస్తున్నారు?"

"సంవత్సరంగా..!"

"మీకు జీతాలు బాగానే ఇస్తున్నారా?"

"ఫర్వాలేదు. మా ఫ్యామిలీ నీడ్స్‌కి సరిపోతుంది!"

"ఇంకా మంచిఉద్యోగం- అంటే... గవర్నమెంట్ ఉద్యోగమో, బ్యాంకు ఉద్యోగానికో ప్రయత్నించలేదా?"

"లేదు. నాకు సుదర్శన్‌గారితో అగ్రిమెంట్ వుంది. మా తమ్ముడి హార్ట్ ఆపరేషన్‌కి లక్షరూపాయలు ఆయన అప్పుగా ఇచ్చారు. అందువల్ల మూడేళ్లు నేను ఆయన దగ్గర పనిచేసి తీరాలి. నెలనెలా ఆ డబ్బు నా సేలరీ నుంచి రికవర్ చేస్తారు!"

మొదటిసారిగా ఆమె అంటే గౌరవం కలిగింది మాధవ్‌కి. కుటుంబ బాధ్యతల కోసం కష్టపడేవాళ్ళంటే అతనికి మంచి అభిప్రాయం, సానుభూతి ఉంది.

"మీ నాన్నగారేం చేస్తారు?"

"లేరు. నా చిన్నప్పుడే పోయారు! నేను, అమ్మ, తమ్ముడు... మేము ముగ్గురమే!"

"ఐసీ..! సుదర్శన్ ఇలా ఫైల్స్ ఇంతకుముందు కూడా ఇళ్లకు పంపించేవాడా?"

ఆమె అతని వైపు తీక్షణంగా చూసి, తల తిప్పుకుంది.

'ఆ ప్రశ్న అడగకుండా ఉండవలసింది!' అనుకున్నాడు మాధవ్.

"ఇంట్లో డికాషన్ ఉంది. వేడికాఫీ తాగుదాం!" అంటూ లోపలికి నడిచాడు.

"మీరు కూర్చోండి... నేను చేసి తీసుకొస్తాను!" అంటూ అతని వెనకే వచ్చింది.

మాధవ్ ఆమెకు వంటగది చూపించి పాలు, చక్కెర డబ్బా ఇచ్చి వచ్చాడు.

ఆడవాళ్ళతో ఎక్కువగా పరిచయాలు లేని మాధవ్‌కి అలా ఓ అందమైన అమ్మాయి తను ఒంటరిగా ఉన్నప్పుడు వచ్చి, తనింట్లో కాఫీ చేసియిచ్చే సన్నివేశం ఎంతో మధురంగా వుంది. 'ఈమె శాశ్వతంగా తనింట్లోనే ఉండిపోతే? తను ప్రయత్నిస్తే అసంభవమేమీ కాదు. కాకపోతే- ఆమె క్యారెక్టర్ గురించే తాను విచారించాలి!' అనుకున్నాడు.

ఇంతలో... కల్పన కాఫీకప్పులతో వచ్చింది.

"సారీ... మీకు శ్రమ ఇచ్చాను!" అన్నాడు కప్పు అందుకుంటూ.

"ఫర్వాలేదు. ఇందులో శ్రమేముంది..?" అంది.

కాఫీ తాగాక టైము చూసుకుంటూ "మీరు ఫైలు చూడ్డం అయిపోతే నేను త్వరగా ఇంటికెళ్లాలి. మా అమ్మ ఆరోగ్యం అంత బాగాలేదు!" అంది.

"ఫర్వాలేదు. నేను రాత్రి చూస్తానులెండి. మీరు వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు!" అన్నాడు.

"నేను అన్నది- కంపెనీ ఫైలు గురించి కాదు..!" అంది తలవంచుకుని.

ఆమె శ్లేష అర్థమైంది అతనికి. అయినా అర్థంకానట్లు చూశాడు.

ఆమె అతని దగ్గరగా వచ్చి,

"నిజం చెప్పండి- నేను వెళ్లడం మీకిష్టమేనా?" అని అడిగింది.

ఆమె 'జడలో పెట్టుకున్న మల్లెపూల పరిమళం, చీర నుంచి వస్తున్న సెంటు పరిమళం... అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఆమె కళ్ళతోనే అతన్ని ఆహ్వానించింది.

మాధవ్ లేవలేదు.

అతనికెందుకో... ఆ సన్నివేశమే అసహ్యంగా ఉంది. ఓ స్త్రీ... అందునా భారతదేశపు స్త్రీ... అలా పరాయిపురుషుణ్ణి రెచ్చగొట్టి శృంగారానికి ఆహ్వానించడం అతను జీర్ణించుకోలేక పోయాడు.

"రండి..!" అంటూ అతని చెయ్యిపట్టి లాగింది.

మాధవ్ లేచాడు. లేచి ఆమె చెంపపై ఒక్కటిచ్చాడు.

ఆమె కళ్ళలో నీరు తిరిగింది ఆ దెబ్బకి! అవమానంతో, బాధతో అలాగే కూర్చుండిపోయింది కుర్చీలో.

"ఛీః... నువ్వు ఆడదానివేనా? నీ చదువు నేర్పిన సంప్రదాయం, సంస్కారం ఇవేనా? గెట్ లాస్ట్..!" అన్నాడు కోపంగా.

కల్పన కదల్లేదు. భావరహితంగా ఉన్నాయి ఆమె కళ్ళు.

ఇంతలో... కాలింగ్‌బెల్ మ్రోగింది!

కల్పన వైపు ఒకసారి చూసి, తలుపు తెరిచి బయటికొచ్చాడు. ఎదురుగా ఒక అబ్బాయి నిలబడి వున్నాడు. పదిహేనేళ్లు ఉండొచ్చు- అతని వయసు.

"ఎవరు కావాలి?"

"మా అక్క... కల్పన!" తడబడుతూ అన్నాడు.

అతనికి చిరాకేసింది. "ఎందుకు?" అన్నాడు విసుగ్గా.

"మా అమ్మకి ఆయాసం ఎక్కువగా ఉంది. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి!"

"ఇక్కడే ఉండు..!" అని లోపలికి వచ్చి, "మీ తమ్ముడొచ్చాడు. మీ అమ్మకి ఆయాసం ఎక్కువగా ఉందట! మీ వేషాలు తెలిసిందంటే... గుండె ఆగి చస్తుంది. ఆమె బ్రతికినన్నాళ్లూ ఆమెని మనశ్శాంతిగా ఉంచండి. డబ్బు ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు. తల్లిని పోగొట్టుకున్నారంటే తిరిగి సంపాదించుకోలేరు... వెళ్లండి!" అన్నాడు.

ఆమె ఏమీ జవాబివ్వలేదు.

మౌనంగా చెప్పులు తొడుక్కొని బయటకి నడిచింది.

ఆమెను చూస్తుంటే... 'అలా మాట్లాడి ఉండవలసింది కాదేమో!' అనుకున్నాడు. గబగబా ఆమెను సమీపించి-

"ఎలా వెళ్తారు? మీ కంపెనీ కారు వెళ్లిపోయినట్లుంది. నా కారులో డ్రాప్ చేయనా?" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడకుండా తమ్ముడి చేయి పట్టుకొని నడుస్తూ వెళ్లిపోయింది.

• • •

**కొ**రియర్ అతను తెచ్చిన కవరుని చించి, అందులోని ఉత్తరాన్ని చదవసాగాడు మాధవ్.

"మాధవ్ గారికి-

చెంపపై మీ దెబ్బ మానింది. మనసుపై దెబ్బ మాత్రం మానలేదు.

మానదు కూడా! ఎందుకంటే... మాటల వల్ల కలిగే బాధ భరించలేనిది, మరువలేనిది!

సుదర్శన్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయమని అన్నప్పుడు నావల్ల కాదని ఎంత బ్రతిమాలినా ఒప్పుకోలేదు. 'ఇదే మొదటిసారి, చివరిసారి!' అని, కోటిరూపాయల లోను కోసం నేనీ పని చేయకతప్పదనీ, లేకుంటే నేను కట్టవలసిన లక్షరూపాయలు వెంటనే కట్టమనీ, కట్టకుంటే కోర్టులో కేసు వేస్తాననీ బెదిరించాడు. మా నాన్న మరణంతోనే గుండెలు బ్రద్దలైన మా అమ్మ- గుండెకు వైద్యం చేయించుకున్న మా తమ్ముడు- నేను జైలుకెళ్తే బ్రతకరు. బ్రతికినా వాళ్ళను పోషించేవారు లేరు.

అందుకే ఒప్పుకున్నాను. కాదు... ఒప్పుకున్నట్లు నటించాను. ఎనిమిది గంటలకు మా తమ్ముడు వచ్చి, 'అమ్మకి అనారోగ్యం!' అనిచెప్పి నన్ను కాపాడేలా ప్లాను వేసుకున్నాను. ఆ ధైర్యంతోనే మీతో చొరవ చూపించాను. ఎందుకంటే... నేను 'కో ఆపరేట్' చేయలేదని మీరు సుదర్శన్‌కి కంప్లైంట్ చేయకూడదు కనుక! కాని, మా తమ్ముడు ఐదునిముషాలు ఆలస్యం చేయడంవల్ల మీతో మాటలు పడ్డాను. నాకూ మిమ్మల్ని తిరిగికొట్టాలని, మీ మాటలు త్రిప్పికొట్టాలని ఎంతో అనిపించింది. కాని, చేయలేకపోయాను. కారణం... మా దారిద్ర్యం!

మీరు అంత నీతిమంతులైతే సుదర్శన్ ఫోన్‌చేస్తే ఎందుకు ఒద్దని చెప్పలేదు? 'అతడు ఫోన్ పెట్టేశాడు' అంటారేమో! అతని ఫోన్‌నెంబరు మీకు తెలియదా? సెల్‌లో దొరకదా? నేను మీ ఇంటికి వచ్చాక ఎంతసేపు కంపెనీ ఫైల్స్ చూడగలిగారు? నన్ను ఎందుకు అలా గుడ్లప్పగించి చూస్తూండిపోయారు? డబ్బున్నవాళ్ళు చేస్తే వెరైటీ! పేదవాళ్ళు చేస్తే అన్ ఎథికల్..! మగవాడు చేస్తే మగతనం.., ఆడది చేస్తే తిరుగుబోతుతనం!

నేను నిజంగా తిరుగుబోతునే అయివుంటే- మీ మాటలు దులుపుకొని వెళ్లిపోయేదాన్ని! మీరు నన్ను కొట్టినా- మీకు ఎందుకు ఈ ఉత్తరం రాస్తున్నానో తెలుసా..? మీరు తప్పుకి సిద్ధపడినా- మీ మనసు సిద్ధపడలేదు. మీలో మానవత్వం, నైతిక విలువల పట్ల గౌరవం ఉంది కనుకే అవకాశం వచ్చినా వినియోగించుకోలేదు. అటువంటి మంచిమనిషి మదిలో ఓ బజారు ఆడదానిలా ముద్రపడకూడదనే ఈ ఉత్తరం రాస్తున్నాను.

మీ శ్రేయోభిలాషిగా ఒకమాట! సుదర్శన్‌కి లోను ఇచ్చేముందు అన్నీ మరొకసారి చూడండి. అన్నీ సరిగ్గావుంటే నన్ను ఉపయోగించుకునే అవసరం లేదు అతనికి. లోను ఇచ్చి మీరు రిస్కులో పడకూడదని నా తపన! నేను ఇలా రాశానని మీరు సుదర్శన్‌తో చెప్పరనే నమ్మకం నాకుంది.

చివరగా ఒకమాట! ఆరోజు మీ మానసిక సంఘర్షణ చూశాక ఈ మాట చెబుతున్నాను. మిమ్మల్ని పెళ్ళిచేసుకోబోయే వ్యక్తి చాలా అదృష్టవంతురాలు.

- కల్పన"

● ● ●

**ఈ** ఉత్తరం అందిన కొద్దిరోజులకు మాధవ్ రెండు ముఖ్యమైన పనులు చేశాడు.

అవి ఒకటి... కల్పనకి క్షమాపణలు చెప్పడం!

రెండు... ఆమెని అదృష్టవంతురాల్ని చెయ్యడం!!